'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## అటు కరువు.. ఇటు సమృద్ధి

*దేశంలోని అనేక ప్రాంతాలు దాహార్తితో అలమటిస్తున్నాయి. వట్టిపోయిన ప్రాజెక్టులతో, ఎండిన పంటలతో బిక్కుబిక్కుమంటున్నాయి. ఇందుకు భిన్నంగా తెలంగాణ అన్ని కాలాల్లో నిండైన జలాశయాలతో కళకళలాడుతున్నది. పంటలకు భరోసా ఏర్పడింది. నివాస గృహాలకూ నల్లాల ద్వారా పుష్కలంగా తాగునీరు అందుతున్నది. నీటిగోసకు శాశ్వతంగా తెరపడటం తెలంగాణ రాష్ట్రం గత తొమ్మిదిన్నరేండ్లలో సాధించిన నికర విజయంగా చెప్పుకోవచ్చు. ఒకప్పుడు ఇది ఊహకు కూడా అందని విషయం. ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ప్రజల, పంటల దూపను తీర్చిన ఘనకీర్తిని కేసీఆర్ ప్రభుత్వం దక్కించుకున్నది. ఆ కృషి ఫలితంగానే ఇప్పుడు దేశంలోని ఇతర ప్రాంతాలకూ, తెలంగాణకూ మధ్య తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. దేశంలో 717 జిల్లాలుంటే అందులో 221 జిల్లాల్లో కరువు పరిస్థితులు ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వ అధికారిక లెక్కలు తెలియజేస్తున్నాయి. గత 15 ఏండ్లలో సుమారు 100 జిల్లాలు తొమ్మిదేండ్లు కరువును ఎదుర్కొన్నాయి. నీటి ఎద్దడి అనేది ఒక నిరంతర ప్రక్రియగా మారిపోయింది.*

*గత పాతికేండ్లుగా భారత్‌లో కరువు ప్రభావిత ప్రాంతం 57 శాతం పెరిగిందని కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్) నివేదిక వెల్లడించింది. మన పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఏపీల్లోనూ పలు ప్రాంతాలు కరువుకు గురికావడం ఆందోళనకరం. ప్రస్తుతం దేశంలోని 80 శాతం రిజర్వాయర్లలో నీటినిల్వలు సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉన్నాయని కేంద్ర జల సంఘం నివేదిక తెలియజేస్తున్నది. కేంద్రానికి కరువు నివేదికలు, కరువు సాయానికి అభ్యర్థనలు యథావిధిగా జరిగిపోతున్నాయి. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జల సంరక్షణకు 'జలదృశ్యం' పూర్తిగా మారిపోయింది. సమర్థమైన నీటి యాజమాన్యం వల్ల గత ఎనిమిదేండ్లలో జిల్లా కాదు కదా కనీసం ఒక మండలం కూడా కరువు బారిన పడలేదు. మిషన్ కాకతీయతో చెరువుల్లో పూడిక తీయడం, చిన్నాపెద్దా ప్రాజెక్టులు పూర్తిచేసి కాలువలతో అనుసంధానించడం, హరితహారం ద్వారా అడవులు పెంచడమనే బహుముఖ వ్యూహాన్ని పటిష్ఠంగా అమలు చేసిన ఫలితంగా ఎండాకాలంలోనూ మత్తళ్లు దుంకాయి మన రాష్ట్రంలో.*

*తెలంగాణ అభివృద్ధికి నీటి వనరులను మళ్లించడంలో కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయాలపై ఇప్పటికీ శరపరంపరగా ప్రశంసలు కురుస్తున్నాయి. తాజాగా దేశంలోని 'సాగునీటి ప్రాజెక్టుల సామర్థ్యం'పై కేంద్ర జల్‌శక్తి శాఖ పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో రాష్ట్రానికి చెందిన సాత్నాల, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులు ప్రథమ స్థానం లో నిలవడమే ఇందుకు ఉదాహరణ. ప్రాజెక్టుల పరిపూర్తి మాత్రమే కాకుండా వాటిని సమర్థంగా నిర్వహించడంపై కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడమే ఈ గుర్తింపును తెచ్చిపెట్టింది. నదుల వెంబడి నాగరికత అభివృద్ధి చెందిందని చెప్పుకొంటారు. కానీ, ఇప్పటి కాలంలో నాగరికత ఎక్కడుంటే నదులు అక్కడికే పరుగులు తీయాల్సి ఉంటుంది. అలా మళ్లించగలిగినప్పుడే ప్రజలు సుభిక్షంగా ఉంటారు. కేసీఆర్ లాంటి దార్శనిక నేత మాత్రమే నీటి బిందువు కోసం మట్టి కన్న స్వప్నాన్ని సాకారం చేయగలరు. జల సమృద్ధిని సాధించిపెట్టి ప్రజలకు గట్టి భరోసా ఇవ్వగలరు. ఇందుకు మన జలచరిత్రే సాక్షి.*

# సుస్థిరత దిశగా అడుగులు

**మిగతా రాష్ట్రాలతో పోలిస్తే జమ్మూకశ్మీర్‌ను ఇన్నేండ్లు ప్రత్యేకంగా నిలిపిన ఆర్టికల్ 370 కాలగర్భంలో కలిసిపోయింది. భారత ప్రభుత్వం, జమ్మూకశ్మీర్‌కు మధ్య ఉండే చిన్నపాటి సన్నని తెర కూడా తొలగిపోయింది. ఆర్టికల్ 370 రద్దు సబబేనని, రాజ్యాంగబద్ధమేనని భారత సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పడంతో ఒక వివాదాస్పద అధ్యాయం ఓ కొలిక్కి వచ్చినట్టయింది. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సహా ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం దేశ చరిత్రలో నిలిచిపోయే తీర్పు వెలువరిస్తూ సార్వభౌమత్వం అనేది దేశానికే ఉంటుంది తప్ప ప్రాంతాలకు కాదని స్పష్టం చేయడం గమనార్హం.**



**మాలోతు సురేష్**
98856 79876



జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఈ తీర్పును వెలువరించడం విశేషం. ప్రాంతాల కంటే భారత రాజ్యాంగమే సర్వోన్నతమైనదనే సూత్రీకరణ ఈ తీర్పు సారాంశం. దేశ సమగ్రత విషయంలో రాజీ పడకుండా ఏ నిర్ణయమైనా తీసుకునే అధికారం రాష్ట్రపతికి రాజ్యాంగం కల్పించిందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్నది. మరోవైపు ఒకే దేశంలో రెండు సార్వభౌమాధికారాలకు తావు లేదని సుప్రీంకోర్టు తీర్పు ద్వారా మరోసారి స్పష్టం అయింది. గతాన్ని మరిచి భవిష్యత్తు వైపు అడుగులు వేయడం ఇటు దేశానికి, అటు కశ్మీర్‌కు శ్రేయస్కరమని.. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించడాన్ని బట్టి తెలుస్తున్నది. అయితే జస్టిస్ కౌల్, జస్టిస్ ఖన్నా ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని సమర్థిస్తూనే వేర్వేరుగా మరో రెండు తీర్పులను వెలువరించారు. కశ్మీర్‌లో సుస్థిరత, అభివృద్ధి, శాంతిభద్రతలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై వారు అందులో ప్రస్తావించారు.

ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును దాదాపుగా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు స్వాగతించడం కశ్మీర్ సమస్యపై రాజకీయ ఏకాభిప్రాయాన్ని సూచించే అంశం. ఈ తీర్పుపై కేంద్రంలోని బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ సహా జమ్మూకశ్మీర్‌లోని నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పార్టీలు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించిన తీరును మెచ్చుకోవాల్సిందే. ఎంతో సున్నితమైన ఈ అంశంపై రెచ్చగొట్టి పబ్బం గడుపుకొనే రాజకీయాలకు తావు లేకుండా తమ తమ అభిప్రాయాలను ఆయా పార్టీల నేతలు వినిపించారు. ప్రధాని మోదీ సహా బీజేపీ నేతలంతా సుప్రీంకోర్టు తీర్పును ముక్తకంఠంతో స్వాగతించగా.. ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు జమ్మూకశ్మీర్‌లో ప్రజా పాలన రావాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. మరోవైపు నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ అధినేతలు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ ఈ తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేసినా.. తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించడాన్ని స్వాగతించాల్సిందే.

**ఒకసారి చరిత్ర పుటల్లోకి తొంగి చూస్తే.. 1947లో మన దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిన నాటి నుంచి నలుగుతున్న ఈ సమస్య సుప్రీంకోర్టు తీర్పుతో ఓ కొలిక్కి వచ్చినట్టు అయింది. ఆనాడు సంక్షోభ పరిస్థితుల్లో తప్పనిసరై తీసుకొచ్చిన ఆర్టికల్ 370.. కాలక్రమంలో జటిల సమస్యగా మారిపోయింది. 1947లో భారత్‌కు స్వాతంత్య్రం వచ్చాక కశ్మీర్ సహా దేశంలోని సుమారు 562 వరకు చిన్నచిన్న రాజ్యాలు, సంస్థానాలు భారత్‌లో విలీనం అయ్యాయి.**

కొంత ఇబ్బందులు ఎదురైనప్పటికీ జూనాగఢ్, హైదరాబాద్ సంస్థానాలు కూడా సాఫీగానే భారత్‌లో విలీనమైపోయాయి. కానీ ఆనాటి నుంచి నేటి వరకు కశ్మీర్ అంశం మాత్రం కొరకరాని కొయ్యగానే మిగిలిపోయింది. అప్పటి కశ్మీర్ పాలకుడు మహారాజా హరిసింగ్ భారత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం కారణంగా తెరపైకి వచ్చిన ఆర్టికల్ 370 దీనికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఈ ఆర్టికల్ వల్ల జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి సిద్ధించింది. ఒకే దేశం రెండు జెండాలుగా పరిస్థితి మారిపోయింది. కశ్మీరీ ప్రజలకు మనమూ భారత్‌లో అంతర్భాగం అనే భావన లేకుండాపోయింది. తాము ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రత్యేకమనే భావన వారిలో పాతుకుపోయింది. ఈ కారణంగానే అక్కడ సీమాంతర ఉగ్రవాదం వేళ్లూనుకుపోయింది.

కశ్మీర్ అంశంపై మొదటి నుంచి భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతున్న దాయాది పాకిస్థాన్ ప్రస్తుత సుప్రీంకోర్టు తీర్పుపై కూడా విషం కక్కింది. ఆ దేశ విదేశాంగ మంత్రి జలీల్ అబ్బాస్ జిలానీ భారత సర్వోన్నత న్యాయస్థానం తీర్పును తప్పుబట్టారు. జమ్మూకశ్మీర్‌పై భారత్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవడమేంటని ఆయన వ్యాఖ్యానించడాన్ని బట్టి చూస్తే పాక్ వైఖరి స్పష్టం అవుతున్నది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను ఆసరాగా చేసుకొని పాకిస్థాన్ మొదటి నుంచి కశ్మీర్‌ను అస్థిర పరచాలని చూస్తున్నది. కశ్మీర్‌పై పట్టు సాధించేందుకు పాక్ చేయని ప్రయత్నమంటూ లేదు. భారత్‌లో కల్లోలం సృష్టించేందుకే ఆ దేశం ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నది. అందులో భాగంగానే భూతల స్వర్గం పీవోకేను ఉగ్రవాదుల అడ్డాగా మార్చేసింది. ఉగ్ర స్థావరాలకు పీవోకే కేరాఫ్‌గా మారిపోయింది. భారత సరిహద్దులకు సమీపంలో శిక్షణ పొందుతున్న ఉగ్రవాదులు పాక్ సైనికుల పహారాలో సరిహద్దు కంచెలను దాటి భారత్‌లోకి చొరబడుతున్నారు. కొండలు, అటవీ ప్రాంతాల్లో నక్కి ఉంటున్న తీవ్రవాదులు కశ్మీర్‌లో శాంతికి భంగం కలిగిస్తున్నారు. అందుకే మొదటి నుంచి ఆర్మీకి శాశ్వత స్థావరంగా కశ్మీర్ మారిపోయింది. మరోవైపు వేర్పాటువాదుల ముసుగులో అమాయక కశ్మీరీ ప్రజలకు లేనిపోనివి నూరిపోసి కొంతమంది పబ్బం గడుపుకొంటున్నారు. స్వార్థపరుల కారణంగా విద్య, ఉపాధికి దూరమవుతున్న అక్కడి యువత సంఘ విద్రోహ శక్తుల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నారు.

ఆర్టికల్ 370ను పార్లమెంట్ రద్దు చేసిన నాటి నుంచి అక్కడి ప్రజలు తమ ఉనికిని కోల్పోయినట్టు భావిస్తున్నారు. ఏదో పోగొట్టుకున్నట్టు బాధపడుతున్నారు. మనకు ఆర్టికల్ 370 అనేది ఒక అధికరణం మాత్రమే కావచ్చు. కానీ, అక్కడి ప్రజలకు ఇది ఒక భావోద్వేగంతో కూడిన అంశం. పైగా ఏండ్లుగా వారు తమను ప్రత్యేకంగా ఉంచిన ఆర్టికల్ 370 లేకపోవడాన్ని జీర్ణించుకోలేకపోవచ్చు. అక్కడి వేర్పాటువాద నేతలు కూడా దీనికి ఓ కారణం. అసలు ఆర్టికల్ 370 అనేదే కశ్మీర్ అభివృద్ధికి అడ్డంకి అనే అంశాన్ని వారికి వివరించాల్సి ఉంది. భారత ప్రభుత్వం ముందుగా చేయాల్సిన పని ఇదే. దీని నుంచి బయటపడి ప్రగతి వైపు అడుగులు వేయాల్సిన అవసరాన్ని వారికి నొక్కి చెప్పాలి.

**ప్రకృతి రమణీయతకు మారుపేరైన కశ్మీర్ అభివృద్ధికి అడ్డంకిగా మారిన ఆర్టికల్ 370 కాలగర్భంలో కలిసిపోవడంతో ఇకపై దాని గురించి మర్చిపోయి ప్రగతి వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు ముందుగా అక్కడ సుస్థిరతను ఏర్పరచాలి. శాంతిభద్రతలను నెలకొల్పాలి. మానవ హక్కుల ఉల్లంఘనలు జరగకుండా చూడాలి. శాంతిభద్రతలు అదుపుతప్పిన చోట అభివృద్ధి, ప్రగతి కుంటుపడతాయి. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రగతికి శాంతిభద్రతలు అదుపులో ఉండటమూ ఓ కారణం అనేది గుర్తుంచుకోవాలి. మరోవైపు స్థానికేతరులు అక్కడి భూములు కొనేందుకు వీలు లేకపోవడం కూడా కశ్మీర్ అభివృద్ధికి అవరోధంగా మారింది.**

భారత్‌లో విలీనం అయిన నాటి నుంచి జమ్మూకశ్మీర్ అత్యధిక కాలం గవర్నర్ల పాలనలోనే ఉన్నది. 2018లో మెహబూబా ముఫ్తీ పాలన ముగిసిన తర్వాత మళ్లీ అక్కడ ఎన్నికలే జరగలేదు. అప్పటి నుంచి నేటి వరకు లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలోనే జమ్మూకశ్మీర్ ఉన్నది. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ తీసుకొచ్చిన బిల్లును పార్లమెంట్ ఆమోదించిన నాటి నుంచి జవాన్ల పహారాలోనే కశ్మీర్ ఉన్నది. అత్యధిక కాలం ఆర్మీ పహారా ఉండటం కూడా మంచిది కాదు. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా అక్కడ ప్రజా పాలనను తీసుకురావాల్సిన అవసరం ఉన్నది. మరోవైపు జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలి. తాజాగా పార్లమెంట్ ఆమోదించిన జమ్మూకశ్మీర్ రీ ఆర్గనైజేషన్ బిల్లు, రిజర్వేషన్ల బిల్లులు ప్రజా పాలన దిశగా దోహదం చేస్తాయని ఆశించవచ్చు. సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా ఏడాదిలోపు ఎన్నికలు నిర్వహించి ప్రజా పాలనను తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. జవాన్ల పహారాలో తాత్కాలికంగా శాంతిభద్రతలు నెలకొల్పినంత కాలం కశ్మీర్‌లో సుస్థిరత ప్రశ్నార్థకమే!

# తప్పు చేయలేదు.. అయినా తప్పుకుంటున్నా!

**ప్రియమైన తెలంగాణ ఉద్యోగార్థులకు నమస్కారాలతో..**

**'ఆర్.సత్యనారాయణ.. అనే నేను టీఎస్‌పీఎస్సీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను. కొత్త కమిషన్ ఆధ్వర్యంలోనే నియామకాలు జరగాలన్న ఉద్యోగార్థుల ఆకాంక్షలను గౌరవిస్తున్నాను. ఇప్పుడే కాదు.. నేను నా విద్యార్థి జీవితం నుంచీ కూడా నిరుద్యోగుల పక్షమే. ఇకముందు కూడా నిరుద్యోగుల పక్షమే. మీ అందరి ఆశలు, ఆకాంక్షలు వీలైనంత త్వరగా నెరవేరాలని కోరుకుంటున్నాను.**



**ఆర్.సత్యనారాయణ**
టీఎస్‌పీఎస్సీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ




టీఎస్‌పీఎస్సీలో పేపర్ల లీకేజీలు లాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు మీరు ఎంత ఆందోళనకు గురయ్యారో, ఎంత ఆవేదన చెందారో ఒక జర్నలిస్టుగా, ఒక మానవతావాదిగా నేను అర్థం చేసుకోగలను. ఈ పేపర్ లీకేజీ సంఘటనలు జరిగినప్పుడు కమిషన్ బాధ్యులుగా మేము కూడా తీవ్ర మానసిక క్షోభను అనుభవించాం. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాం. తీవ్ర అనారోగ్యాలకు గురయ్యాం. మాకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఉద్యోగార్థుల ప్రయోజనాలను రక్షించేందుకే అహర్నిశలు కృషిచేశాం. అయినప్పటికీ ఇప్పుడున్న పరిస్థితుల్లో కమిషన్ సభ్యుడిగా నేను నా బాధ్యతను నిర్వర్తించలేని పరిస్థితి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలోనే నేను పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను.

మిత్రులారా! మీకు తెలుసు. టీఎస్‌పీఎస్సీ రాజ్యాంగబద్ధమైన సంస్థ. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 315 నుంచి 323 వరకు ఈ సంస్థకు వర్తిస్తాయి. సంస్థ నిర్మాణం, కమిషన్ ఏర్పాటు రాజ్యాంగంలోని వివిధ ఆర్టికల్స్ ప్రకారం జరుగుతాయి. కమిషన్ నుంచి ఎవరినైనా తొలగించాలంటే దానికీ ఒక పద్ధతి ఉంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి విచారణలో ఆరోపణలు రుజువైతే రాష్ట్రపతి కమిషన్‌ను తొలగించవచ్చు. కానీ, కమిషన్‌లో ఏ సభ్యుడిపై కూడా వ్యక్తిగత ఆరోపణలు రాలేదు. విచారణ జరగలేదు. కానీ, కమిషన్‌ను రద్దు చేయాలని కొందరు, కమిషన్ సభ్యులను తొలగించాలని మరికొందరు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. రాజ్యాంగం గురించి, ప్రభుత్వ నిబంధనల గురించి తెలిసినవారు కూడా ఈ రకమైన డిమాండ్ చేస్తూ వస్తున్నారు. పౌర సమాజంలోని వివిధ సంస్థలు ఈ తరహా డిమాండ్‌ను ముందుకు తెస్తూ వస్తున్నాయి. టీఎస్‌పీఎస్సీపై ఏకపక్షమైన విమర్శల దాడి జరుగుతున్నది. మరికొందరైతే కమిషన్ బాధ్యులను అసమర్థులంటూ పరుషమైన పదజాలంతో నిందిస్తున్నారు. తద్వారా వ్యక్తిత్వాలను హత్య చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో హేతుబద్ధమైన విశ్లేషణలు కరువయ్యాయి. విచారణ లేకుండానే గంపగుత్తగా టీఎస్‌పీఎస్సీ సభ్యులందరినీ దోషులుగా నిర్ణయించేశారు. చస్తారో, బతుకుతారో తేల్చుకోకుండా మెడపై కత్తులు వేలాడదీశారు.

కమిషన్ సభ్యులుగా కొనసాగాలని, ఈ పదవులు పట్టుకుని వేలాడాలని మాకు ఏ మాత్రమూ లేదు. పదవులు మాకు ముఖ్యం కాదు. తెలంగాణ నిరుద్యోగుల ప్రయోజనాలే ముఖ్యం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నేను ఆరేండ్ల ఎమ్మెల్సీ పదవిని ఏడాది లోపే తృణప్రాయంగా వదులుకున్నాను. స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేశాం. మా సహచర సభ్యులు కూడా రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేశారు. ఈ తరహా చరిత్ర కలిగిన మాకు తెలంగాణ నిరుద్యోగుల ప్రయోజనాలే ముఖ్యం తప్ప పదవులు కాదు.

2021 మే 19న మేము కమిషన్ సభ్యులుగా నియామకమైన నాటినుంచి ఇప్పటివరకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా మా బాధ్యతలను నిర్వర్తించాం. 17,269 ఉద్యోగాలకు సంబంధించి 26 నోటిఫికేషన్లు జారీ చేశాం. 13,821 ఉద్యోగాలకు సంబంధించి 20 పరీక్షలు నిర్వహించాం. ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. ఈలోగా కొందరు స్వార్థపరుల కారణంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నాయి. వీటివల్ల నిరుద్యోగులకు అన్యాయం జరిగింది. వారంతా ఎంతో మానసిక ఆందోళనకు గురయ్యారు. మేము కూడా తీవ్రమైన మానసిక ఆందోళనకు, ఆవేదనకు, క్షోభకు గురయ్యాం. ఈ పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకునేందుకు కొందరు స్వార్థపరులు ప్రయత్నించారు.

టీఎస్‌పీఎస్సీకి రాజకీయ మార్పులతో సంబంధం లేదు. ప్రభుత్వాలు మారినా కమిషన్ కొనసాగుతుంది. కమిషన్‌కు ఒకసారి నియామకం అయ్యాక నియమిత కాలం పదవిలో కొనసాగవచ్చు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో మేము మా బాధ్యతను నిర్వర్తించే వాతావరణం లేదు. ఈ నేపథ్యంలో నేను టీఎస్‌పీఎస్సీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను.

**మిత్రులారా! నేను ఎల్లప్పుడూ మీ పక్షమే. ఎక్కడున్నా ఉద్యోగార్థులకు మేలు జరగాలనే కోరుకుంటాను. మీ పక్షానే నిలిచి చేదోడు వాదోడవుతాను. మీకు మంచి జరగాలని ఆకాంక్షిస్తాను. ధన్యవాదాలతో...**

# ఇబాదత్‌ఖాన తీర్పులో ఏముంది?

**షియా వర్గానికి చెందిన ఓ తెగ ముస్లిం మహిళలకు ఊరట లభించింది. ఏన్నో ఏండ్లుగా చేస్తున్న వారి పోరాటం ఫలించింది. షియా వర్గంలోని అక్బరీ తెగ మహిళలను కూడా ఇబాదత్‌ఖానలోకి అనుమతించాలని తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. జషన్లు, మత పరమైన కార్యకలాపాల్లో వారికి కూడా స్థానం కల్పించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక తాజాగా ఆదేశించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అంజుమన్ ఏ అలావి, షియా ఇమామియా ఇత్నా అసారి అక్బరీ సొసైటీ కార్యదర్శి ఆస్మా ఫాతీమా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ఈ మేరకు వారికి ఊరట కలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం విశేషం.**



దారుల్‌షిఫాలో 150 ఏండ్ల చరిత్ర కలిగిన ఇబాదత్‌ఖాన విషయంలో షియా ముస్లిం వర్గంలోని రెండు తెగల మధ్య ఎప్పటి నుంచో వైరం నడుస్తున్నది. 2019లో దీన్ని పునర్మించిన తర్వాత ఇక్కడ మత పరమైన కార్యకలాపాలు, ఉత్సవాలు, వేడుకలు జరుగుతున్నాయి. అయితే షియా వర్గంలోని ఉసూలీ తెగ మహిళలను జషన్లు తదితర కార్యకలాపాలకు అనుమతిస్తూ తమ పట్ల వివక్ష చూపుతున్నారని అక్బరీ షియా తెగ మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై రాష్ట్ర వక్ఫ్ బోర్డు, ఇబాదత్ ఖాన ముతావలీ కమిటీకి ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు. వివిధ కోర్టుల్లో దీనిపై కేసులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్బరీ తెగకు చెందిన పలువురు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా విచారణ జరిపిన హైకోర్టు అక్బరీ తెగ మహిళలను కూడా వేడుకలు, ఉత్సవాలకు అనుమతించాలని ఆదేశాలివ్వడం ప్రాధాన్యం సంతరించుకున్నది. అయితే వారిని ఎందుకు అనుమతించలేదో పేర్కొంటూ కౌంటర్ దాఖలు చేయాలని వక్ఫ్ బోర్డును హైకోర్టు ఆదేశించడం గమనార్హం.

*- ఎడిటోరియల్ డెస్క్*



# ఆత్మహత్యలను నివారిద్దాం!

**డిసెంబర్ నెల వచ్చిందంటే విద్యార్థుల్లో పరీక్షల గురించిన ఆందోళన మొదలవుతుంది. ఒకవైపు సిలబస్ పూర్తి చేసే హడావుడిలో ఉపాధ్యాయులు, అధ్యాపకులుంటారు. మరోవైపు వివిధ ప్రవేశ పరీక్షలకు నోటిఫికేషన్లు విడుదలవుతుంటాయి. ఇంకోవైపు కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేసుకునే పనిలో ఉంటాయి. ర్యాంకులు, మార్కుల ఒత్తిడిలో విద్యార్థులు నలిగిపోతుంటారు. ఫలితంగా వారు తీవ్ర నిరాశతో ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు.**



**యం.రాం ప్రదీప్**
9492712836

ఓడిపోవడం తప్పు కాదు. విజయానికి అది ఓ మెట్టు మాత్రమే. కానీ మారుతున్న కాలానికి తగ్గట్టుగా పరుగులు తీయలేక కొందరు, ఆర్థిక, వ్యక్తిగత, మానసిక..ఇలా అనేక కారణాలతో మరికొందరు తనువు చాలిస్తున్నారు. అయితే బతికి సాధించాలే తప్ప, ఆత్మహత్యలతో ఎలాంటి ప్రయోజనం ఉండదు. అంతేకాదు వారి మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి జీవితాలు కూడా అంధకారమవుతాయి.

పరిశోధకుల అధ్యయనం ప్రకారం.. ఎవరైతే తాను ఇక బతకడం వృథా అని, పదే పదే ఆత్మహత్యల గురించి మాట్లాడుతారో, తమకు తామే హాని చేసుకోవడానికి యత్నిస్తారో వారిలో ఆత్మహత్య ఆలోచనలు ఎక్కువగా ఉంటాయి. అటువంటి వారు ఎక్కువగా ఒంటరితనాన్ని ఇష్టపడుతారు. ప్రతి సందర్భంలోనూ చికాకుపడుతుంటారు. ఇతరులతో మాట్లాడకుండా ఏకాకిగా ఉండాలనుకుంటారు. తాము చేసే ప్రతి పనిలోనూ అసంతృప్తిగా ఉండటం, నిద్రలేమితో బాధపడటం, జీవితంలో తనకు కావాల్సింది ఏదీ దక్కలేదని పదే పదే ప్రస్తావించడం లాంటి లక్షణాలు కనిపిస్తే ఆ వ్యక్తులు ఆత్మహత్య చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మానసిక వైద్యనిపుణులు చెప్తున్నారు. మరికొందరు మీడియా ప్రభావంతో తాత్కాలిక ఆకర్షణకులోనై, ప్రేమ పేరుతో భావోద్వేగాలతో, తాము అనుకున్నది పొందలేకపోతే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

కరోనా కారణంగా విద్యార్థులు చాలా కాలం చదువులకు దూరంగా ఉన్నారు. దాంతో పరోక్షంగా పిల్లలపై ఒత్తిడి పెరిగింది. చాలామంది ప్రాథమిక అంశాలు కూడా మరిచిపోయారు. ఇప్పుడిప్పుడే విద్యార్థులు గాడినపడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్తున్న దాని ప్రకారం 15 నుంచి 19 ఏండ్ల వయస్సు గల యువతలో మరణానికి నాలుగో ప్రధాన కారణం ఆత్మహత్య అని తెలుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ఏటా 7 లక్షల మందికి పైగా ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇందులో 77 శాతం కేసులు తక్కువ, మధ్య ఆదాయ దేశాల నుంచి ఉంటున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకారం, చాలామంది ప్రజలు పురుగుమందులు తాగి, ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నారు. అయితే, ఇటువంటి ఆత్మహత్యలను నియంత్రించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్తున్నది.

ఆత్మహత్యలను నియంత్రించాలంటే విద్యాలయాల్లో మానసిక నిపుణులను నియమించాలి. వారిచేత విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. కొన్ని సమయాల్లో కొన్ని కోర్సులకే డిమాండ్ ఉంటుంది. విద్యార్థులు వేలాది రూపాయలు వెచ్చించి వాటిని నేర్చుకుంటారు. తీరా నేర్చుకున్నాక వాటితో ఉపాధి అవకాశాలు రాకుండా పోతాయి. వివిధ కోర్సులకు సమాన అవకాశాలు ఉండేవిధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. విద్యార్థులతో తల్లిదండ్రులు ప్రతిరోజు కొంత సమయం గడపాలి. వారి అవసరాలను, ఇబ్బందులను తెలుసుకోవాలి. మార్కులే ప్రామాణికంగా కాకుండా వారికి విభిన్న రంగాల్లో రాణించేలా శిక్షణ ఇప్పించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు ఉమ్మడిగా ఆత్మహత్యల నివారణకు కృషిచేయాలి.